పేట్రేగిపోతున్న మందుబాబులు

జాలరిపేట తీరం అడ్డాగా అసాంఘిక కార్యకలాపాలు

నిత్యం గొడవలు, వీరంగం

శ్మశానవాటికను ఆనుకొని ఆగడాలు

స్థానికులు, సందర్శకుల్లో భయాందోళనలు





జాలరిపేట సాగర తీరంలో మందుబాబుల అసాంఘిక కార్యకలాపాలు, తగాదాలు జరుగుతున్న దృశ్యాలు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 19వ వార్డులోని పెదజాలరిపేట సముద్ర తీరం మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్కడ నిత్యం గొడవలు, వీరంగం సృష్టిస్తూ పేట్రేగిపోతున్నారు. వార్డులోని లాసన్స్ బే పార్కు నుంచి పెదజాలరిపేట వరకు విస్తరించి ఉన్న ఈ సముద్ర తీర ప్రాంతాన్ని మందుబాబులు వారి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మార్చుకుంటున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిత్యం మద్యం తాగడంతోపాటు పేకాట, ఇతర జూద క్రీడలు ఆడుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. గ్రూపులుగా ఏర్పడి మద్యపానం చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యకలాపాలు అనేక సార్లు గొడవలకు, గ్రూప్ తగాదాలకు సైతం దారితీస్తున్నాయి. కొంతకాలంగా



మందుబాబుల కార్యకలాపాలతో అధ్వానంగా మారిన సాగర తీర ప్రాంతం

ఈ తరహా ఆగడాలు ఎక్కువవుతుండటంతో ఇతరులు ఆ ప్రాంతానికి వెళ్లడానికే భయపడుతున్నారు.

అంత్యక్రియలకు ఇబ్బందులు

ఈ తీరంలో శ్మశానవాటిక ఉండగా.. పెదవాల్తేరు, చినవాల్తేరులతోపాటు ఇతర ప్రాంతాల ప్రజలు వారికి సంబంధించిన కుటుంబ సభ్యులు మరణిస్తే ఇక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. ఆ సమయంలోనూ మందుబాబులతో తగాదాలు నెలకొంటున్నాయి. శ్మశానవాటికలోనే కొందరు మద్యం తాగుతూ బీరు సీసాలను పగలగొడుతుండటంతో అంత్యక్రియలకు వచ్చిన వారు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రిపూట అయితే శ్మశానవాటిక అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారుతోంది. ఒక పక్క మందుబాబులు.. మరో పక్క గంజాయి గ్యాంగ్‌లు విచ్చలవిడిగా తిరుగుతుండటంతో అటువైపుగా వెళ్లేందుకు అంతా భయపడుతున్నారు.

చీకటి పడితే భయం భయం

ఇక్కడి లాసన్స్ బే పార్కులో సేదతీరేందుకు వచ్చిన వారు సైతం చీకటి పడితే పార్కులో ఉండేందుకు భయపడుతున్నారు. దీంతో పాటు శ్మశానవాటికలో ప్రశాంత వాతావరణంలో కార్యకలాపాలు నిర్వహించే వీలుండటం లేదని పలువురు వాపోతున్నారు. ఈ సమస్యపై అనేక సార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా.. శాశ్వత పరిష్కారం లభించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

పోలీస్ పికెట్ అవసరం

మందుబాబులకు అడ్డాగా మారిన జాలరిపేట సాగర తీరంలో పరిస్థితిని చక్కదిద్దేందుకు శాశ్వత ప్రాతిపదికన ఒక పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని పార్కు సందర్శకులు, స్థానికులు కోరుతున్నారు. ఆరిలోవ లాస్ట్ బస్‌స్టాప్, నిర్మానుష్య ప్రాంతాల్లో పోలీసు బృందాలతో కూడిన పికెట్‌లు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ తరహా వ్యవస్థను నిత్యం ఇక్కడ అందుబాటులో ఉంచడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అప్పుడే సాగర తీరంలో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా నగర పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

24న యూఎన్‌వో ఆవిర్భావ దినోత్సవం

మద్దిలపాలెం: ఈ నెల 24న ఐక్య రాజ్య సమితి(యూఎన్‌వో) 79వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం, బి.వి.ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థల ప్రతినిధి ప్రకాశరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీపీపీ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో ఉదయం 11 గంటల నుంచి వేడుకలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఐక్య రాజ్య సమితి పనితీరు, సంస్కరణల ఆవశ్యకత అంశాలపై వక్తలు అవగాహన కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.జగదీశ్వరరావు, డాక్టర్ బాబ్జి, డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



విద్యార్థుల తల్లులకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లోని బీవీకే పాఠశాలలో ఆదివారం త్రిదండి చినజీయర్ స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య వికాస్ నిర్వాహకులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందితోపాటు విద్యార్థుల తల్లులు 80 మందికి వైద్య సిబ్బంది గర్భాశయ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్‌కు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆంకాలజిస్ట్ డాక్టర్ వసంత మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. వాటి లక్షణాలు కనిపించిన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ శకుంతల, బీవీకే బోర్డు ఆఫ్ డైరెక్టర్ అంజలి ప్రసాద్, స్వర్ణలత, పాఠశాల ప్రధానోపాధ్యాయిని మాధవి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఈఈ బి.సింహాచలం నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సెక్టార్-6లోని అంజయ్యనగర్, మెడికవర్ హాస్పిటల్, రాజీవ్ పార్కు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

పని కోసం కూలీల ఎదురుచూపులు



ఇసుకతోట కూడలిలో పనులకు పిలిచే వారి కోసం ఎదురుచూస్తున్న కూలీలు

మద్దిలపాలెం: ఇసుక సమస్యతోపాటు ఇటీవల కురుస్తున్న వర్షాలు కూలీల జీవనాన్ని దెబ్బతీస్తున్నాయి. అసలే ఇసుక సమస్యతో అరకొర పనులు దొరకడమే గగనంగా మారిన తరుణంలో.. వర్షాలు పస్తులు పాలు చేశాయి. వర్షాలు వెలిశాక కూలీలు అధిక సంఖ్యలో ఇసుకతోట కూడలి వద్దకు చేరుకుని పనుల కోసం పరుగులు తీస్తున్నారు. ఆ రోడ్డులో వాహనం ఆగితే చాలు.. ఎంతమంది కావాలి సార్ అంటూ ప్రాధేయ పడుతున్నారు. వరుసగా పనులు లేకపోతే పూట గడవడం కష్టమంటూ వాపోతున్నారు. అద్దె ఇళ్లలో ఉంటూ, అద్దె చెల్లించడానికి సైతం సంపాదన లేక అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కూలీలు పనుల కోసం ఎదురు చూసి.. దొరక్కపోవడంతో నిరాశగా ఇంటి ముఖం పట్టారు.

పాత వెంకోజీపాలెంలో స్థల వివాదం



స్థలం స్వాధీనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు, టీడీపీ కార్పొరేటర్ అనుచరులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెం గవర వీధిలో ఓ స్థలానికి సంబంధించి ఆదివారం వివాదం జరిగింది. ఘటన వివరాలిలా.. గ్రామంలో వందేళ్ల చరిత్ర గల పెద్ద నుయ్యితో కలిసి ఉన్న 3 సెంట్ల భూమి పాత వెంకోజీపాలెం శ్రీ సీతారామ సేవా సంఘానికి చెందిదంటూ.. సంఘ సభ్యులు ఆదివారం దానిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. ఆ స్థలం తమదంటూ స్థానిక వ్యక్తి, పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఓ టీడీపీ కార్పొరేటర్‌తో కలిసి పోలీసుల సహాయంతో సంఘ సభ్యులను అడ్డుకున్నారు. దీంతో స్థల వివాదంపై వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. అస్తవ్యస్తంగా ఉన్న ఈ స్థలాన్ని నాలుగు నెలల నుంచి శుభ్రం చేస్తున్నామని సంఘ సభ్యులు చెబుతున్నారు. గతంలో ఇక్కడి పెద్ద నుయ్యి చుట్టుపక్కల ప్రాంతాల వారికి తాగునీటి బావిగా ఉండేదని, అప్పట్లో విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పైప్ లైన్లు ఏర్పాటు చేసి దీని నుంచే తాగునీటి సరఫరా కూడా చేసేదన్నారు. కాలక్రమేణా బావి నీరు అడుగంటి ఖాళీగా ఉండిపోయిందంటున్నారు.

నాలుగు నెలలుగా చర్చలు

నూతిని, దానికి ఆనుకుని ఉన్న స్థలాన్ని శుభ్రం చేసి సంఘ అభివృద్ధికి వినియోగించేందుకు సంఘ పెద్దలు సిద్ధమయ్యారు. నాలుగు నెలలుగా ఈ స్థలం తమదంటూ వచ్చిన గ్రామస్తులతో వారు చర్చలు జరుపుతూనే ఉన్నారు. అవి కొలిక్కి రాకపోవడంతో సంఘ సభ్యులు ఇక్కడ ప్రహరీ నిర్మించేందుకు యత్నించారు. దీంతో ఈ స్థలం తమదని, మీరెలా గోడ కడతారంటూ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి టీడీపీ కార్పొరేటర్ సహకారంతో పోలీసులతో కలిసి వారిని అడ్డుకున్నారు. దీనిపై ఇప్పటికే ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామ సేవా సంఘానికి చెందిన స్థలాన్ని అప్పగించాలని తాము సైతం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నామని సంఘ సభ్యులు తెలిపారు.

రహదారికి అడ్డంగా పశు సంచారం



ఏయూ అవుట్ గేట్ ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా సంచరిస్తున్న పశువులు

ఏయూక్యాంపస్: రహదారికి అడ్డంగా పశువుల సంచారం ఇబ్బందులకు గురిచేస్తోంది. ఏయూ అవుట్ గేట్ ప్రాంతంలో నిత్యం పదుల సంఖ్యలో పశువులు సంచరిస్తుంటాయి. కిర్లంపూడి, బీచ్ రోడ్డు ప్రాంతంలో ఇవి రోడ్లపై పడుకుని వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పశువులు ఒకదానినొకటి పొడుచుకోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పశు వ్యర్థాలతో రహదారులు సైతం అధ్వానంగా తయారవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కొన్ని సమయాలలో వాహన ప్రమాదాలకు సైతం ఇవి కారణంగా మారుతున్నాయి. ఇటీవల బీచ్ రోడ్డులో ఒక గేదెను కారు గుద్దడంతో తీవ్రంగా గాయపడింది. ప్రమాదాలు జరుగుతున్నా.. పెంపకం దారులు మాత్రం పశువులను రోడ్లపైకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు.

పొంగిపొర్లుతున్న యూజీడీలు



ఇసుకతోట రోడ్డులో లీకవుతున్న మ్యాన్‌హోల్



కిర్లంపూడి లేఅవుట్‌లో యూజీడీ మ్యాన్‌హోల్ లీకై రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

మద్దిలపాలెం: పలు ప్రాంతాల్లో యూజీడీ మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతున్నాయి. జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో మ్యాన్‌హోళ్లు లీకై మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. మురుగు దుర్వాసనతో నివాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య నిత్యం ఉన్నా.. యూజీడీ విభాగం సిబ్బంది పట్టించుకోడం లేదని స్థానికులు చెబుతున్నారు. మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో రాకపోకలు సాగించలేకపోతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

రహదారిపై మురుగు ప్రవాహం

ఏయూక్యాంపస్: కిర్లంపూడి లేఅవుట్‌లోని అంబికా సీ గ్రీన్‌కు చేరువలో జీవీఎంసీ భవనం సమీపాన యూజీడీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు ఉబికి వస్తోంది. ఇది బీచ్ రోడ్డు వైపు ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో నడవాలంటేనే ఇబ్బందికరంగా మారింది. తరచూ ఈ ప్రాంతంలో యూజీడీ లీకేజీ సమస్య తలెత్తుతోంది. పర్యాటకులు, నగరవాసులు అధికంగా రాకపోకలు సాగించే ఈ రహదారిలో యూజీడీ వ్యవస్థను జీవీఎంసీ సిబ్బంది చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

రెగ్యులర్ చేయాలని వినతి



ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న 2008 డీఎస్సీ జేఏసీ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: తమను రెగ్యులర్ చేయాలని 2008 డీఎస్సీకి చెందిన ఉపాధ్యాయులు(ఎంటీఎస్) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2008 డీఎస్సీ స్టేట్ జేఏసీ ఎంటీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంవీపీ కాలనీలోని కార్యాలయంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ 2008 డీఎస్సీకి సంబంధించిన 2,193 మంది అభ్యర్థులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులుగా నియమించిందన్నారు. మినిమం టైం స్కేల్‌గా పరిగణిస్తూ నియామక పత్రాలు అందజేసిందని తెలిపారు. కొద్దికాలం వ్యవధిలో రెగ్యులర్ చేస్తామని చెప్పినా.. అది కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఎంటీఎస్‌గా విధులు నిర్వరిస్తున్న తమను రెగ్యులర్ చేయాలని కోరారు. రాష్ట్ర మంత్రి లోకేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి రెగ్యులర్ చేసేలా కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చినట్లు జేఏసీ ప్రతినిధులు వాసుదేవరావు, మహేష్, మూర్తి, రాజు, లింగమూర్తి, నూకిశెట్టి, శ్రీనివాస్ తదితరులు తెలిపారు.

చేనేత వస్త్ర ప్రదర్శనకు స్పందన



వస్త్రాలను తిలకిస్తున్న మహిళలు

ఎంవీపీకాలనీ: దయాళ్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో స్థానిక ఉషోదయ కూడలిలోని ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. రెండో రోజు ఆదివారం సైతం పెద్ద ఎత్తున నగరవాసులు ప్రదర్శనను తిలకించి వస్త్రాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శన నిర్వాహకులు దక్షిణామూర్తి, ప్రేమ్‌స్వరూప్ మాట్లాడుతూ నాణ్యమైన చీరలు, డ్రెస్ మెటీరియల్స్ తదితర ఉత్పత్తులను తక్కువ ధరకే సంస్థ ద్వారా విక్రయించినట్లు చెప్పారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రదర్శనకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే మరో ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు.

డ్రైనేజీలో పేరుకుపోయిన ప్లాస్టిక్ బాటిళ్లు



వీఐపీ రోడ్డులోని డ్రైనేజీ నుంచి బయటకు తీసిన ప్లాస్టిక్ బాటిళ్లు

బీచ్‌రోడ్డు: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం అనేక అనర్థాలకు కారణమవుతోంది. నగరవాసులు తాగి పడేసిన వాటర్, కూల్‌డ్రింక్ బాటిళ్లతో డ్రైనేజీలు నిండిపోతున్నాయి. వీఐపీ రోడ్డులోని డ్రైనేజీలో పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ వాటర్, కూల్‌డ్రింక్స్ బాటిళ్లు పేరుకుపోయాయి. వాటిని ఆదివారం జీవీఎంసీ సిబ్బంది తొలగించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నీ ప్రారంభిస్తున్న కంచర్ల అచ్యుతరావు

ఆరిలోవ: ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఆరిలోవలోని జీవీఎంసీకి చెందిన ఖాళీ మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ సందడి మొదలైంది. టోర్నీని ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు ప్రారంభించి మాట్లాడారు. సీజన్-2 ఉపకార్ కప్-2024 పేరుతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో 24 ఫ్రాంచైజీల నుంచి 450 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, 12 రోజుల పాటు టోర్నీ జరుగుతుందని చెప్పారు. యువత చెడుతోవకు వెళ్లకుండా క్రీడాకారులుగా ప్రోత్సహించడానికి ఈ ప్రయత్నం చేస్తున్నామన్నారు. టోర్నీలో విజేత జట్టుకు రూ.1.20 లక్షలు, రన్నరప్‌కు రూ.60 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30 వేల చొప్పున ప్రైజ్ మనీ అందిస్తామని వివరించారు. ఈ నెల 29తో పోటీలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ పర్యవేక్షకులు సుధీర్, రెహ్మాన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాల కల్పనే కళాకారులకు నిజమైన ప్రోత్సాహం

గాయకుడు గజల్ శ్రీనివాస్



గజల్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వైజాగ్ బీట్స్ సంస్థ వ్యవస్థాపకురాలు శారద తదితరులు

ఎంవీపీకాలనీ: ప్రతిభకు అనుగుణంగా సినిమా, ఇతర రంగాల్లో అవకాశాలు కల్పించడమే కళాకారులకు నిజమైన ప్రోత్సాహమని గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. సినీ గాయకుల వేదిక వైజాగ్ బీట్స్ సంస్థ 8వ వార్షికోత్సవం ఆదివారం ఎంవీపీ కాలనీ బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం జరిగిన గాయకుల సత్కార వేడుకలో గజల్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. కళా నైపుణ్యం ఉన్న వారికి ప్రస్తుతం అవకాశాలు కోకొల్లలుగా ఉన్నాయని చెప్పారు. వారి ప్రతిభను సమాజానికి తెలియజేసేలా అవకాశం ఉన్న ప్రతి వేదికపైనా సత్తా చాటాలన్నారు. కొత్త కళాకారులకు సినీ రంగ ప్రముఖులు అవకాశాలు కల్పించాలని కోరారు. వైజాగ్ బీట్స్ గాయకులు అద్భుతంగా వారి సంగీత నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ఉదయం సినిమా డైరెక్టర్ పీసీ ఆదిత్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైజాగ్ బీట్స్ తరఫున హెచ్ఐవీ బాలలను సంరక్షిస్తున్న డిజైర్ సొసైటీ నిర్వాహకుడు లక్ష్మణ్‌కు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. గజల్ శ్రీనివాస్‌తోపాటు డైరెక్టర్ పీసీ ఆదిత్యను సంస్థ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. గాయకులు అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. కార్యక్రమంలో వైజాగ్ బీట్స్ వ్యవస్థాపకురాలు డి.శారద, ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన సంస్థ సభ్యులైన గాయనీ గాయకులు పాల్గొన్నారు.

సత్యసాయి అవతార వైభవం



మహా నగర సంకీర్తనను ప్రారంభిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు



విద్యుద్దీప కాంతుల్లో సత్యసాయి ప్రేమసదన్

బీచ్‌రోడ్డు: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా దివ్య అవతార ప్రకటన దినోత్సవం సందర్భంగా ఆదివారం సిటీ సత్యసాయి సమితి ఆధ్వర్యంలో మహా నగర సంకీర్తన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేక భజన చేసి అక్కడ నుంచి సంకీర్తన ప్రారంభించారు. పెదవాల్తేరు, శాంతి ఆశ్రమం, లాసన్స్ బే కాలనీ, ఉషోదయ జంక్షన్ మీదుగా ప్రేమ సదన్ మందిరానికి సంకీర్తన ఊరేగింపు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ డి.వి.వి.సీతారామరాజు మాట్లాడుతూ బాబా 14 ఏళ్ల వయసులో భక్తుల కోసం వెళ్లాలని చెప్పి ఇంటి నుంచి వచ్చిన రోజును దివ్య అవతార ప్రకటన రోజుగా జరుపుతున్నామన్నారు. నవంబర్ రెండో శనివారం నాడు ప్రపంచ వ్యాప్తంగా ఒకేసారి 24 గంటల నామస్మరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంకీర్తనల అనంతరం సత్యసాయి భక్తులకు అల్పాహార ప్రసాదం అందజేశారు.

శోభాయమానంగా ప్రేమసదన్

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయిబాబా అవతార ప్రకటన దినోత్సవం సందర్భంగా ఎంవీపీ కాలనీ సెక్టార్-8లోని సత్యసాయి ప్రేమసదన్‌ను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రేమసదన్‌లో సత్యసాయికి వింజామర సేవ, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. మహా నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు తెలిపారు.

ఏయూ ప్రొఫెసర్ వెంకటస్వామికి అబ్దుల్ కలాం పురస్కారం



ప్రతిభా పురస్కారం స్వీకరిస్తున్న ఏయూ తెలుగు ఆచార్యుడు బూసి వెంకటస్వామి

మద్దిలపాలెం: దక్షిణాది రాష్ట్రాల్లో అత్యంత ప్రతిభావంతులైన, వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికిచ్చే డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగ ఆచార్యుడు డాక్టర్ బూసి వెంకటస్వామి అందుకున్నారు. గుంటూరు ఏసీ కళాశాల ఆడిటోరియంలో సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అభినందన సభలో వెంకటస్వామికి అవార్డు ప్రదానం చేశారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ కె.మోజేష్, మలినేని విద్యా సంస్థల డైరెక్టర్ మలినేని పెరుమాళ్ల, అపుస్మా డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు, అప్సా డైరెక్టర్ మేకల రవీంద్రబాబు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా బూసి వెంకటస్వామిని ఏయూ ఉన్నతాధికారులు, తెలుగు విభాగ ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు, తెలుగు సాహితీ, భాషాభిమానులు అభినందించారు.

హామీలు మరచిన కూటమి ప్రభుత్వం



నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం మరిచిపోయిందని సీపీఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి రెహ్మాన్ ఎద్దేవా చేశారు. సీపీఐ ఆరిలోవ జోన్ నాయకులు ఆదివారం ఆరిలోవ కాలనీలోని వీధుల్లో ర్యాలీ చేశారు. ఇంటింటికీ వెళ్లి పెరిగిన నిత్యావసర సరకుల ధరలపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోయాయన్నారు. వాటిని ప్రభుత్వం అదుపు చేయలేకపోతోందని విమర్శించారు. సాధారణ ప్రజలపై ధరల రూపంలో ఆర్థిక భారం మోపుతూ చేతగాని ప్రభుత్వంగా నిలిచిపోతోందన్నారు. ధరలు తగ్గించకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

సెలవు రోజున బాసర కళాశాలలో తరగతులు

అడ్డుకున్న ఏబీవీపీ సభ్యులు



ఇసుకతోట బాసర జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఏబీవీపీ సభ్యులు

మద్దిలపాలెం: నిబంధనలకు విరుద్ధంగా ఇసుకతోటలోని బాసర జూనియర్ కళాశాలలో ఆదివారం సెలవు రోజున తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నారని ఏబీవీపీ అర్బన్ జిల్లా కన్వీనర్ ఉమ్మడి నితిన్ అన్నారు. ఆదివారం నాడు తరగతులు నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఏబీవీపీల బృందం కళాశాలను సందర్శించామన్నారు. బాసర కళాశాలలోని అన్ని తరగతుల్లో విద్యార్థులు ఉన్నారని గుర్తించామని చెప్పారు. సెలవుల్లో తరగతులు నిర్వహించడానికి వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టామన్నారు. దసరా పండగ సెలవుల్లోనూ తరగతులు నిర్వహించారని విద్యార్థులు పేర్కొన్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ సంచాలకుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆయన, ఆర్ఐవో ఆదేశాల మేరకు ఇసుకతోట బాసర కళాశాలను ఆదివారం మూసివేశారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కన్వీనర్ నితిన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ లొడగల అచ్చిబాబు, రాష్ట్ర కో కన్వీనర్ రాయుడు నితిన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రసాద్ నల్లబెల్లి, నైదాన ధనుష్, సిరిపురపు వాసు, కంచుమూర్తి విష్ణువర్ధన్, దార్ల పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.